తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం

- వాటిలో అనేక ప్రయోజనాలు
- శిశువుకు ఆరు నెలలు వచ్చే వరకూ తప్పకుండా పట్టించాలి
- కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు

బిక్కవోలు: ఆప్యాయత, అనురాగానికి మారు పేరు అమ్మ. అలాంటి అమ్మ పాలు బిడ్డకు అమృతమే. కడుపులో ఉన్న తొమ్మిది నెలలు బిడ్డకు కావాల్సిన ఆహారాన్ని తల్లి సమకూర్చుతుంది. బిడ్డ పుట్టిన క్షణం నుంచి తన ముర్రుపాలతో బిడ్డకు ఆహారాన్ని అందిస్తుంది. తల్లి పాలతో బిడ్డకు ఆకలి తీర్చడమే కాకుండా వ్యాధి నిరోధక శక్తి పెంచుతుంది. తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానం. ఆధునిక పోకడలతో కొంతమంది తల్లులు బిడ్డకు పాలు ఇచ్చేందుకు విముఖత చూపుతున్నారు. ఫలితంగా పిల్లలు అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోంది. బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకూ తల్లులు పాలు ఇవ్వని కారణంగా చిన్నారులు రోగ నిరోధకశక్తిని క్రమంగా కోల్పోతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. దీంతో మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ఎలాంటి పౌష్టికాహారం తీసుకోవాలి, పిల్లలకు పాలు ఎలా తాగించాలి, అమ్మపాల విశిష్టతను వివరించేందుకు తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

ప్రాముఖ్యత ఇదీ

తల్లి పాల ప్రాముఖ్యతపై తల్లులకు అవగాహన కల్పించేలా అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీల్లో వివిధ కార్యక్రమాలను అధికారులు చేపడుతున్నారు. పుట్టిన శిశువుకు గంటలోపు తల్లిపాలు తప్పనిసరిగా తాగిస్తే రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. కామెర్లు, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులను నిర్మూలించే కొన్ని ఔషధ గుణాలు తల్లి పాలలో ఉంటాయి. బిడ్డ బరువు పెరిగేందుకు ఇవి దోహదపడతాయి. పగటిపూట ఇచ్చే పాలకన్నా రాత్రి పూట బిడ్డకు పాలివ్వడం ద్వారా బిడ్డ ఎదుగుదల బాగా ఉంటుంది. ఫలితంగా తల్లికి బిడ్డకు మంచి బంధం ఏర్పడుతుంది.



గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ప్రముఖులు (ఫైల్)

పాలిచ్చేటప్పుడు తల్లి ఒడి ద్వారా వేడి బిడ్డకు చేరి చాలా వ్యాధులు దరిచేరవు. తల్లిమాట వినగానే చిన్నారులు ఏడుపు మానేయడమో, ఆకలిగా ఉంటే ఏడవటమో చేస్తారు. స్పర్శ వినికిడి పెరుగుతోంది. కడుపు నిండా పాలు తాగిన చిన్నారులకు బుద్ధిమాంద్యం, మానసిక రుగ్మతలు వచ్చే అవకాశం తక్కువ. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు తాగిస్తే శిశుమరణాలు తగ్గుతున్నట్లు అధ్యయనాల ద్వారా వెల్లడైంది.

ఉపయోగాలు

తల్లి పాల వల్ల బిడ్డకు వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. మెదడు పెరుగుదల బాగుంటుంది. ఐక్యూ లెవల్స్ ఎక్కువగా ఉంటాయి. 1000 గోల్డెన్ డేస్‌లో బిడ్డకు తల్లిపాలతో పాటు అనుబంధ పౌష్టికాహారం అందించటంతో బిడ్డ జీవిత కాలం మంచి ఆరోగ్యస్థితిని పొందుతారు. విద్య, చురుకుదనం, సానుకూల అభివృద్ధి, మంచి నైపుణ్యాలు, మంచి ఆలోచనలు కలిగి ఉంటారు.

ఆరు నెలల వరకూ..



పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఎంతో మంచివి. ఆరు నెలలు వచ్చే వరకూ తల్లి పాలే ఇవ్వాలి. రోజుకు 10 నుంచి 12 సార్లు బిడ్డకు పాలు పట్టించాలి. బిడ్డ ఏడ్చిన ప్రతిసారీ పాలు ఇవ్వొచ్చు. రోజుకు ఏడు నుంచి పది సార్లు మూత్రం పోస్తుంటే పాలు బాగా పడుతున్నట్లు తల్లి గుర్తించాలి.

– డాక్టర్ విజయలక్ష్మి, కొంకుదురు పీహెచ్‌సీ

అవగాహన కల్పిస్తున్నాం



ముర్రిపాల ప్రయోజనాలను బాలింతలకు అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా వివరిస్తున్నాం. చాలా మంది తల్లులు సరైన ఆహారం తీసుకోకపోవడంతో పాలు సరిపడా ఉండటం లేదు. దీంతో డబ్బా పాలపై ఆధారపడుతున్నారు. డబ్బా పాలు శ్రేయస్కరం కాదు. వాటి వల్ల విరేచనాలు, వాంతులు అయ్యే అవకాశం ఉంటుంది. బాలింతలు ఆకుకూరలు, పప్పులు, పిండి పదార్థాలున్న భోజనం, పాలు, గుడ్లు, మాంసం తినేలా కుటుంబ సభ్యులు చొరవ చూపాలి.

– శాంతి రత్నకుమారి,
ఐసీడీఎస్ సూపర్ వైజర్, ఉలపల్లి సెక్టార్, రంగంపేట ప్రాజెక్టు

క్లుప్తంగా

ఘనంగా గౌరీ శంకర శాంతి కల్యాణం



పందలపాకలో శాంతి కల్యాణం చేస్తున్న అర్చకులు

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని గౌరీ శంకర ఆలయం వద్ద అర్చకుడు గరిమెళ్ల గాంధీ ఆధ్వర్యంలో సోమవారం శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ పున:నిర్మాణాన్ని పురస్కరించుకుని ముందుగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయం కమిటీ చైర్మన్ రెడ్డి గజాలు, బొడ్డు ముత్యాలరావు, బొడ్డు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

308 మందికి వైద్య సేవలు



శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రమేష్ బాబు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో శ్రీరామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరాల్లో 308 మందికి వైద్య సేవలు అందించారు. డాక్టర్లు సత్యం రమేష్ బాబు, రాయుడు శ్రీనివాస్ రోగులను పరీక్షించారు. వైద్యశిబిరంలో 235 మందికి, కంటి శిబిరంలో 76 మందికి పరీక్షలు నిర్వహించారు. 17 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి, వారిని ఆపరేషన్ల కోసం వేమగిరి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, యన్నమని వెంకట నారాయణ, గద్దె వెంకట సత్యనారాయణ, కె.శ్రీనివాస్, చంటిబాబు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

పెదపూడి: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పెదపూడి సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో సూపరింటెండెంట్ పసుపులేటి అనూష ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన ఎక్స్‌రే యూనిట్, రూ.2.50 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, సీహెచ్‌సీ డీసీ మాజీ చైర్మన్ ఆరుమిల్లి అమ్మన్న చౌదరి, వైద్యులు వరప్రసాద్, హర్షవర్ధన్, శుభాష్, ప్రేమ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

▸▸ స్థానిక కల్యాణ మంటపంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్నపిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, ఐసీడీఎస్ సంపర సెక్టార్ సూపర్ వైజర్ చింతా శ్రీపద్మావతి, ఎన్డీఏ నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు జుత్తుక సూర్యకుమారి పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అందుకున్న సుకుమార్



సుకుమార్‌కు పీహెచ్‌డీ అందజేస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ, డిపార్టుమెంట్ ఆఫ్ కెమిస్ట్రీ నుంచి గెంజి సుకుమార్ పీహెచ్‌డీని వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ నుంచి సోమవారం అందుకున్నారు. ×న్యూ సింథటిక్ మెథడాలజీస్ ఫర్ బెంజిమిడజా – ఇసోక్వినోలిన్ అండ్ అజప్లవానోన్స్ అండ్ కం ఫోర్ బేస్ట్ ఎమినో ఆసిడ్ అస్ న్యూటర్న్ ఇండూసింగ్ టెంప్లేట్‌౯ అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను ఈ పీహెచ్‌డీ లభించింది. గైడ్‌గా సీఎస్ఐఆర్ – ఐఐసీటీ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, ఎక్స్‌టర్నల్ గైడ్‌గా ఆచార్య బి.జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహరించారు.

మహిళపై దౌర్జన్యం

సీతానగరం: ఇనుగంటివారిపేటకు చెందిన కొప్పుల సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బట్టు వెంకట్రాజు, బట్టు తేజ, తవిటికి వంశి, చిడిపి తరుణ్‌లపై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ సోమవారం తెలిపారు. ఈ నెల 3వ తేదీ రాత్రి 7 గంటలకు తన ఆడపడుచును బస్సు ఎక్కించడానికి సత్యవతి రోడ్డుపైకి వచ్చింది. ఆ సమయంలో బట్టు వెంకట్రాజు ఆమెను దుర్భాషలాడుతూ, నీ క్లాస్‌మేట్‌ను అని నీకు తెలియదా అని భయపెట్టాడు. గొడవ చేస్తే కేసు పెడతానని సత్యవతి అనగా, నీపై నేనే ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానంటూ బెదిరించాడు. అనంతరం ఇంటికి వెళ్లిన సత్యవతిని వెంకట్రాజుతో పాటు తేజ, వంశీ, తరుణ్ భయపెట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామ్ కుమార్

సీతానగరం: సమాజంలో పలు దొంగతనాలు, చోరీలు జరుగుతున్న నేపథ్యంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై డి.రామ్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైన్ స్నాచింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయని, మహిళలు బయటకు వచ్చే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి మహిళపై ఉందన్నారు. సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, సెల్‌ఫోన్‌లో ఏ లింక్‌లను ఓపెన్ చేయరాదన్నారు. ఓటీపీలను ఎవ్వరికీ చెప్పకూడదన్నారు. శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.భారతి, ఏవో సుబ్రహ్మణ్యం, శక్తి టీమ్, మహిళలు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమానికి బెల్ట్ షాపుల బెడద



ఆశ్రమ సమస్యపై పోలీసులతో మాట్లాడుతున్న ఎంపీడీవో భారతి

సీతానగరం: మహాత్మాగాంధీ నడయాడిన సీతానగరంలోని చారిత్రాత్మక కస్తూర్బాగాంధీ ఆశ్రమానికి మద్యం బెల్ట్ షాపుల బెడద ఎక్కువైందని ఆశ్రమవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ్రమం సమీపంలో బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి, మద్యం అమ్మకాలు జోరుగా సాగిస్తున్నారన్నారు. మద్యం తాగిన తర్వాత ఖాళీ సీసాలు, గ్లాసులు, తినుబండారాల కవర్లను ఆశ్రమం లోపలకు విసిరేస్తున్నారని వాపోయారు. విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బెల్ట్ షాపుల కారణంగా పలు ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే వాటిని తొలగించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో భారతి స్థానిక పోలీసులతో మాట్లాడి, ఆశ్రమానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు.

తల్లి పాలతో పిల్లలకు వ్యాధి నిరోధకశక్తి

సీతానగరం: తల్లి పాలతో పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఇందిరా భారతి తెలిపారు. సోమవారం కాటవరంలోని మూడు అంగన్‌వాడీ సెంటర్లు కలిసి సెంటర్ -2లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా సూపర్ వైజర్ భారతి మాట్లాడుతూ ముర్రిపాలతో బిడ్డకు తెలివితేటలు పెరుగుతాయన్నారు. సీహెచ్‌సీ సీహెచ్‌వో ఎస్‌కే చాందినీ బీబీ మాట్లాడుతూ తల్లి పాలకు, డబ్బా పాలకు మధ్య ఉన్న తేడాలను వివరించారు. అనంతరం గర్భిణులకు సూపర్‌వైజర్ భారతి చేతుల మీదుగా పోషణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొంతిన సత్యవేణి, ఏఎన్ఎం ఆర్.జ్యోతి, అంగన్‌వాడీ వర్కర్లు సీహెచ్ పోశమ్మ, ఎ.నాగదుర్గ, సీహెచ్ బేబీ, ఆశావర్కర్లు జ్యోతి, సంధ్య, తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు



కాటవరంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ



బలభద్రపురంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

▸▸ బిక్కవోలు: తల్లి పాలు బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ బలభద్రపురం సెక్టార్ సూపర్ వైజర్ యు.పద్మ అన్నారు. బలభద్రపురంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి పాల విశిష్టతపై అవగాహన నిర్వహించారు. జన్మించిన బిడ్డకు గంటలోపు పాలు పట్టించడం ద్వారా తల్లి బిడ్డల ఆరోగ్యం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచి బుంగా రామారావు, మాజీ ఎంపీటీసీ నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి, ఎంపీటీసీ చిన్న వీరాఘవ రెడ్డి, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నాలుగు అర్జీలు



అర్జీ స్వీకరిస్తున్న ఎంపీడీవో భారతి, డిప్యూటీ ఎంపీడీవో మూర్తి

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు అందాయి. తమ పంట భూమి తక్కువగా ఉన్నందున రీసర్వే చేసి, భూమిని అప్పగించాలని కోరుతూ వంగలపూడికి చెందిన శ్రీవల్లి, సీతానగరానికి చెందిన దుబ్బా పురుషోత్తమరావు అర్జీలు అందించారు. నివాస స్థలాన్ని పక్కవారు ఆక్రమించుకున్నారని చినకొండేపూడికి చెందిన చిడిపి సరళ, సీతానగరంలోని కస్తూర్బాగాంధీ ఆశ్రమం చుట్టు పక్కల స్థలాలను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారని, వాటిని తొలగించాలని కోరుతూ ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తి, ఏవో సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, టైపిస్టు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పరామర్శ



పాలమూరులో టేకుమూడి సత్యవేణిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సోమవారం పాలమూరు గ్రామంలో పలువురిని పరామర్శించారు. పంచాయతీ వార్డు సభ్యురాలు టేకుమూడి సత్యవేణికి ఇటీవల చేయి విరిగింది. ఈ సందర్భంగా ఆమెను మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. అలాగే దొమ్మేటి రవీంద్ర కుమార్ మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, వార్డు సభ్యులు శీలం రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జంధ్యాల పాపయ్య శాస్త్రికి నివాళి



పులగుర్త ఉన్నత పాఠశాలలో పాపయ్య శాస్త్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

అనపర్తి: ప్రముఖ కవి కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి జయంతిని పులగుర్త జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు కె.సీతామహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా పాపయ్య శాస్త్రి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ 20 శతాబ్దంలో జనాదరణ పొందిన తెలుగు కవులలో ఒకరైన పాపయ్య శాస్త్రి కవిత్వం సులభమైన శైలిలో, సమకాలీన ధోరణిలో, చక్కని తెలుగు నుడికారముతో, వినసొంపుగా ఉంటుందన్నారు. కరుణ రస ప్రధానంగా చాలా కవితలు రాసి కరుణశ్రీగా ఖ్యాతిగాంచారన్నారు. అనంతరం విద్యార్థులు పాపయ్య శాస్త్రి రాసిన లలిత సుగుణ జాల తెలుగు బాల శతకంలోని కొన్ని పద్యాలను ఆలపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, జి.జయశ్రీ, లక్ష్మి, వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ఫిర్యాదులు రాకూడదు



క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

- కలెక్టర్ ప్రశాంతి
- నగరంలో పర్యటన

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో పారిశుధ్య పనులను ఫిర్యాదులు రాకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి ఆదేశించారు. నగరంలోని మఠం వీధితో సహా పలు ప్రాంతాలలో సోమవారం నగర ఆరోగ్యశాఖాధికారులతో కలసి ఆమె పర్యటించారు. ఎన్ని గృహాలు ఉన్నాయి, ఎంత మంది పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్, సైడ్ డ్రెయిన్ల నిర్వహణ విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు ఆదేశాలిచ్చారు. ఇంటింటికీ చెత్త సేకరణ నూరుశాతం జరగాలన్నారు. వారానికొకసారి ప్రతి వీధిలో పూడికతీత పనులు చేపట్టాలని, డ్రైనేజీలపై ఆక్రమణలు ఉంటే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో సమన్వయం చేసుకుని తొలగించాలని ఆదేశించారు. డ్రైనేజీ కాలువల్లో పైపులు, ఇతరత్రా ఆటంకాలు ఉంటే ఇంజినీరింగ్ విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లి తొలగించాలని సూచించారు. ఇకపై ప్రతి వారం ఐవీఆర్ఎస్ జరుగుతుందని, పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలు కూడా వ్యక్తిగతంగా పారిశుధ్య కార్యక్రమాలలో భాగస్వామ్యం పంచుకుంటేనే నగరం మరింత సుందరీకరణ దిశగా అడుగులు వేస్తుందన్నారు.

వ్యక్తి అదృశ్యం

సీతానగరం: ఇనుగంటివారిపేటకు చెందిన నలభై ఏళ్ల చిలువూరి నాగేశ్వరరావు అదృశ్యమయ్యాడు. ఈ నెల 2వ తేదీ సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగిరాలేదు. దీంతో ఆత్రేయపురం మండలం ర్యాలీలో ఉంటున్న అతడి అన్నయ్య పోశిబాబు సీతానగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై రామ్ కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే రెండేళ్ల జైలు

రాజమహేంద్రవరం రూరల్: బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే రెండేళ్ల జైలు, లేదా రూ.లక్ష జరిమానా విధిస్తారని జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ జి.క్రాంతిలాల్ అన్నారు. బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ గిరిజన బాలికల సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్లో సోమవారం బేటీ బచావో – బేటీ పడావోలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్రాంతిలాల్ మాట్లాడుతూ కనీస వివాహ వయసు అబ్బాయికి 21 ఏళ్లు, అమ్మాయికి 18 ఏళ్లు అన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే, సంబంధిత అధికారులకు లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ -1098 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు..

నేడు 'టీ తాగుతూ మాట్లాడుకుందాం'

కడియం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు 'రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి విల్సన్ పాల్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సమస్యలను ఒక వీడియో రూపంలో తీసుకురానున్నామన్నారు.

ఉత్సాహంగా 'జిత్ నోట..కిషోర్ పాట'



గాయకుడు శ్రీరామమూర్తిని సత్కరిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తన ఆర్కెస్ట్రా ద్వారా 70 ఏళ్ల బహుభాషా గాయకుడు కిషోర్ కుమార్ పాటలు పాడి, ఆంధ్ర కిషోర్‌గా గుర్తింపు తెచ్చుకున్నానని ఆర్కెస్ట్రా పితామహుడు, నట, గాయకుడు శ్రీపాద జిత్‌మోహన్‌మిత్ర అన్నారు. గాన గంధర్వ కిషోర్ కుమార్ జయంతి సందర్భంగా జిత్ మోహనమిత్ర కళావేదికపై సోమవారం సాయంత్రం 70 ఏళ్లుగా జిత్ నోట కిషోర్ పాట అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనపర్తికి చెందిన గాయకుడు, కవి దర్భా శ్రీరామమూర్తికి గాన గంధర్వ ఘంటసాల పురస్కారం అందించి, సత్కరించారు. ఆర్కెస్ట్రా గాయకులు శ్రీపాద మిత్ర, డా.వంక బాలకృష్ణ, మంగళంపల్లి సూర్య కుమారి, విశ్వనాథ్, డాక్టర్ హరి పాల్గొన్నారు.

పూల వర్తక సంఘం అధ్యక్షుడిగా దుర్గారావు



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న సంఘ సభ్యులు

కడియం: కడియపుసావరం పుష్పలత పూల వర్తక సంఘం నూతన అధ్యక్షుడిగా ప్రముఖ పూల వ్యాపారి గంధం దుర్గారావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కమిటీ అధ్యక్షుడిగా ఇప్పటి వరకు సేవలందించిన చెన్నా శ్రీనివాసరావు తన బాధ్యతలను దుర్గారావుకు బదలాయించారు. స్థానిక పుష్పాలత పూల వర్తక సంఘ భవనంలో ఆదివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు దుర్గారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిలో నియమించిన కమిటీ పెద్దలకు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. వ్యాపారుల సమస్యలను పరిష్కరించేందుకు, వారి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. నూతన కమిటీ ఉపాధ్యక్షుడిగా కేశవరపు అర్జున్, సెక్రటరీగా మంగిన దుర్గారావు, జాయింట్ సెక్రటరీగా వరగోగుల శ్రీను, జ్యోతుల వీరబాబు, సభ్యులుగా 14 మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి సంఘ గౌరవ అధ్యక్షుడు వరగోగుల వెంకటేశ్వరరావు, సర్పంచ్ చెక్కపల్లి మురళీకృష్ణ, మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి, రూరల్ బీజేపీ ఇన్‌చార్జి ఆకుల శ్రీధర్, వెలుగుబంటి నాని, ముద్రగడ జమ్మి, సాపిరెడ్డి కామేష్, మాజీ సర్పంచ్ తుమ్మెద వరహాలరాజు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాదాల నివారణకు 'ఫేస్ వాష్'



డ్రైవర్‌తో ఫేస్ వాష్ చేయిస్తున్న పోలీసులు

కంబాలచెరువు: జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడడంతో పాటు ప్రజలకు భద్రత, భరోసా కల్పించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. దానిలో భాగంగా సోమవారం రాత్రి డ్రైవర్లకు ఫేస్ వాష్ అండ్ గో కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల ప్రకారం జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రి గస్తీని మరింత కట్టుదిట్టం చేసేందుకు ప్రత్యేకంగా పోలీసు బృందాలను, పోలీసు వాహనాలను ఏర్పాటు చేశారు. ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేశారు. రహదారి ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. రాత్రి పూట హైవేపై ప్రయాణించే వాహనదారులకు కూడా ఫేస్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు.